ఎకరాకు రూ.10వేల పరిహారం

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- కేంద్రం మొండిచేయి చూపిస్తే ఊరుకోం : రేవంత్‌రెడ్డి
- దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ సర్వే చేసిన సిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అధైర్యపడొద్దని, అండగా ఉంటామని వరద బాధితులకు సిఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.పది వేల పరిహారం ఇస్తామని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం హనుమకొండ, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల్లో తుఫానుతో దెబ్బతిన్న ప్రాంతాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సిఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సిఎం ఏరియల్ సర్వే నిర్వహించారు. హుస్నాబాద్‌లో నీటమునిగిన పంటలు, దెబ్బతిన్న రోడ్లు, కూలిన కల్వర్టులు, వ్యక్తులు గల్లంతయిన ప్రదేశాలను పరిశీలించారు. నష్టాలపై నివేదకలు తయారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన హుస్నాబాద్, కోహెడ, భీమదేవరపల్లి , అక్కన్నపేట , ఎల్కతుర్తి మండలాల జరిగిన మొత్తం నష్టాన్ని రికార్డు చేస్తున్నట్టు అధికారులు సిఎంకు తెలుపారు. అనంతరం హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని సమ్మయ్యనగర్, కాపువాడ, పోతననగర్ ప్రాంతాలను సందర్శించి వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి వరదలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా స్వర్గీయ ఇందిరాగాంధీ ఛాయాచిత్రం వద్ద నివాళులర్పించారు. తుఫాను నష్టంతో పాటు పంట నష్టాలకు సంబంధించి వెంటనే సర్వే చేసి నివేదికలను పంపాలని తెలిపారు. పంట నష్టాల సర్వేల్లో ప్రజాప్రతినిధులను కూడా


బాధితుల గోడును వింటున్న సిఎం రేవంత్ రెడ్డి

తీసుకువెళ్లాలని సూచించారు. ప్రకృతి విపత్తుపై కేంద్ర ప్రభుత్వం సాయం కోసం ప్రయత్నిస్తామని, కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి మంత్రుల నేతృత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో వెంటనే సమీక్షా సమావేశాలను ఏర్పాటు చేసి జిల్లాల్లో జరిగిన నష్టాలపై నివేదికను రూపొందించాలన్నారు. త్వరితగతిన ప్రిన్సిపల్ సెక్రటరీల ఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించుకోవాలని, అనంతరం వారం రోజుల్లో హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశంలో నివేదికలతో రావాలని కలెక్టర్లు, ఉన్నత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలతో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆదేశించారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇండ్లు పూర్తిస్థాయిలో దెబ్బతిన్న వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆవులు, గేదెలు చనిపోతే రూ.50 వేలు, గొర్రెలు, మేకలు చనిపోతే రూ.5 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వాతావరణంలో చాలా మార్పులు వచ్చాయని, క్లౌడ్ బస్ట్‌లపై దృష్టి కేంద్రీకరించాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ విపత్తు తాత్కాలికమేనని తేలిగ్గా తీసుకోవద్దని, తరుచూ వచ్చే అవకాశముందని, దీనికి పరిష్కారం కనుగోనాలన్నారు.

నాలాల్లో కబ్జాలు తొలగించాల్సిందే..

నాలాల్లో కబ్జాలుంటే వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలన్నారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వరంగల్ నగరం స్మార్ట్‌సిటీ పథకానికి గడువు పెంచేలా అనుమతి తీసుకొచ్చామని, స్మార్ట్ సిటీ కింద ఎన్ని పనులు పూర్తి చేశారో నివేదిక ఇవ్వాలన్నారు. వరంగల్, హనుమకొండ నగరాలకు సంబంధించి మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులతో పాటు సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్, విప్ డాక్టర్ రాంచందర్ నాయక్, తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఉన్నతాధికారులు అరవింద్‌కుమార్, రాహుల్ బొజ్జా, స్టీఫెన్ రవీంద్ర, ఈ. శ్రీధర్, 12 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.1,032 కోట్లు ఒకేసారి విడుదలకు డిప్యూటీ సిఎం ఆదేశం

- బిల్లులు చెల్లించిన ఆర్థిక శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులు అక్టోబర్ మాసానికి సంబంధించి సుమారు రూ.1,031 కోట్లను ఒకేసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. శుక్రవారం ఉదయం ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలను దశలవారీగా ప్రతినెలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్లియర్ చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా అక్టోబర్ మాసానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదే విధంగా రూ.10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను అధికారులు విడుదల చేశారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షల్లోపు విలువ గల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95 కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లను సైతం విడుదల చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

వేడుకగా 'ది కలెక్టిబుల్స్

- ప్రారంభించిన ఎస్ఆర్ ఫౌండేషన్ సుధారెడ్డి



హైదరాబాద్ : క్రాఫ్ట్, డిజైన్, ఆభరణాల సమాహారం 'ది కలెక్టిబుల్స్' సందడిగా జరిగింది. శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని సత్వ సిగ్నేచర్ టవర్స్‌లోని థియరీ ఆఫ్ ఎవ్రితింగ్‌లో జరిగిన ఈ వేడుకను ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎంఇఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి లాంచనంగా ప్రారంభించారు. దీనికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమార్తె నైమిషా రెడ్డి, థియరీ ఆఫ్ ఎవ్రితింగ్ వ్యవస్థాపకురాలు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కుమార్తె ఐశ్వర్య హెగ్డే, ప్రముఖ ఎంటర్‌ప్రిన్యూర్ పింకీ రెడ్డి హాజరై సందడి చేశారు. ఇక్కడ ప్రదర్శించిన గాజు ముత్యాలు, బంగారం, వెండి, వజ్రాలు, రత్నాల కలయికతో కూడిన ప్రతి ఆభరణం ఒక కథగా నిలుస్తుందని సుధా రెడ్డి, ఐశ్వర్య హెగ్డే తెలిపారు.

'శాంతి ఉద్యమంలో రామరాజు పాత్ర మరవలేనిది'

హైదరాబాద్ బ్యూరో : అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) హైదరాబాద్ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి ఎ రామరాజు ఆకస్మిక మరణం శాంతి ఉద్యమానికి తీరని లోటని ఐప్సో రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ , రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్, ప్రధాన కార్యదర్శి జి. నాగేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామరాజు మృతిపట్ల సంతాపాన్ని ప్రకటించి, నివాళులర్పించారు. సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ కుటుంబ నేపథ్యమున్న రామరాజు.. విద్యార్థి దశలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య లోనూ, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్, రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్, శాంతి సంఘీభావ సంఘంలోనూ చురుకైన పాత్రను పోషించారని తెలిపారు. సామ్రాజ్యవాదకి వ్యతిరేకంగా అనేక పోరాటాలను నిర్వహించారని గుర్తు చేశారు.

ప్రజాసంస్కృతి, కళారూపాలను విస్తృతపరచాలి

- పాలకుల మోసాలు, కష్టజీవుల సమస్యలపై కళారూపాలు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మోసాలపై, మనువాద సంస్కృతిపై ప్రజలకు వివరించి చైతన్యపరచాలి.. కష్టజీవుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.. అందుకు ప్రజాసంస్కృతి, ప్రజాకళలను విస్తృత పరచాలి" అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య పిలుపునిచ్చారు. భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతికరంగ కార్యకర్తల రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాగయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని కూలి, భూమి, వివక్ష లాంటి సమస్యలపై నాడు ప్రజాకళలు ప్రజలను కదిలించి పోరాటాల్లో ముందు నడిపాయన్నారు. నేడు నూతన ఆర్థిక విధానాలు, సనాతన పద్ధతులతో పాలకులు, పెట్టుబడిదారులు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆ మోసాలపై ప్రజలు తిరుగుబాటు చేయకుండా సనాతన ధర్మం పేరుతో అణచివేస్తున్నారని, మభ్యపెడుతున్నారని అన్నారు. ఇలాంటి వాటికి వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల వైపు నడిపించడానికి ప్రజా సంస్కృతిని, ప్రజాకళలను ముందుకు తీసుకుపోతామని చెప్పారు. అందుకు వ్యవసాయ కూలీలు, కార్మికులు సంఘటితంగా సిద్ధం కావాలన్నారు.

తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం రాష్ట్ర బాధ్యులు జి.రాములు మాట్లాడుతూ.. ప్రజాకళలు, సంస్కృతి మానవుని దైనందిన జీవితంలో.. అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని అన్నారు. పాలకులు ప్రజలను మూఢ విశ్వాసాల వైపు మళ్లిస్తున్నారని వ్యాఖ్యానించారు. అనేక దేశాలు చైతన్యవంతంతో నూతన టెక్నాలజీని ఉపయోగించుకొని అభివృద్ధి చెందుతుంటే.. మన దగ్గర మాత్రం బిజెపి ప్రజలను మూఢ విశ్వాసాల వైపు నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా సంస్కృతిని ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానంగా భూమి, కూలి, ఉపాధి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై నవంబర్, డిసెంబర్, జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రామారావును ఖమ్మంలో కాంగ్రెస్ గూండాలు చంపడాన్ని సంఘం రాష్ట్ర కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, జిల్లాలకు సంబంధించిన పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, మల్లేశం, పాండు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు భరోసా

- తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్యాయానికి గురైన బాధిత మహిళలు, చిన్నారులకు ఆత్మస్థైర్యం కల్పించి అండగా నిలవాలనే ఉద్దేశంతో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) శివధర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జోన్ డిసిపి కార్యాలయం పక్కన నిర్మించిన నూతన భరోసా కేంద్రాన్ని డిజిపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 33వ భరోసా కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. 2016లో మొదటిసారి భరోసా కేంద్రాన్ని ప్రారంభించినట్టు గుర్తు చేశారు. త్వరలో మరో ఆరు జిల్లాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. మహిళలు, చిన్నారులు, బాలికలకు భరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మనసు విప్పి చెప్పుకోలేని కొన్ని విషయాలను వారి నుంచి రాబట్టి వారికి భరోసా కల్పించేందుకు ఈ కేంద్రాలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. భరోసా కేంద్రాల్లో నిపుణులైన కౌన్సిలర్లు ఉంటారని, వారి ద్వారా బాధితులకు సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వింగ్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలు కొనసాగుతున్నాయ న్నారు. ఈ కేంద్రాల్లో బాధితుల మహిళలు చిన్నారులకు ఆర్థిక సాయం కూడా అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఉమెన్ సేఫ్టీ అడిషనల్ డైరెక్టర్ చారుసిన్హా, శంషాబాద్ డిసిపి రాజేష్, ఎసిపి శ్రీకాంత్‌గౌడ్, ఇన్స్‌స్పెక్టర్ కె.బాలరాజు, పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలి

- సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులదురహంకార హత్యకు గురైన నిండు గర్భిణి తలండి శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కుల, మతాంతర వివాహితుల రక్షణ చట్టం తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ఆయన శుక్రవారం లేఖ రాశారు. కొమురం భీం జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ తలండి శ్రావణి (21) అదే గ్రామం బిసి కులానికి చెందిన శివార్ల శేఖర్ గతేడాది అక్టోబర్ 10న బెల్లంపల్లిలో ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. శేఖర్ తండ్రి శివార్ల సత్తయ్య ఆయన కుటుంబ సభ్యులు ఈ కులాంతర వివాహాన్ని అంగీకరించలేదని పేర్కొన్నారు. దీంతో ఈ జంట శ్రావణి తండ్రి చెన్నయ్య ఇంట్లోనే కాపురం ఉన్నారని వివరించారు. గతనెల 18న ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రావణి మామ శివార్ల సత్తయ్య ఆయన కుటుంబ సభ్యులు (శివార్ల కుమార్, శివార్ల కవిత)తో కలిసి తొమ్మిది నెలల నిండు గర్భిణి అని కూడా చూడకుండా ఆమె కడుపులో, మర్మాంగంలో కత్తితో పొడిచాడని తెలిపారు. ప్రాణభయంతో పరుగెత్తిన శ్రావణిని వెంటాడి గొడ్డలితో తల నరికి నడి వీధిలో హత్య చేశాడని పేర్కొన్నారు. బిడ్డకు జన్మనివ్వకూడదనే తలంపుతోనే ఈ కుల దురహంకార హత్యకు ఆయన పాల్పడ్డారని విమర్శించారు. ఈ ఘటనలో శ్రావణి భర్త శేఖర్‌తో సహా హత్యకు పథకం పన్ని ఆమె తల్లిదండ్రులను ఉదయాన్నే పొలం పనుల పేరుతో బలవంతంగా వాహనంలో తీసుకెళ్లాడని తెలిపారు. ఈ కుల దురహంకార హత్య జరిగి 14 రోజులు గడుస్తున్నా ఆ జిల్లా కలెక్టర్‌గాని, ఎస్‌పిగానీ ఆ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి భరోసా కల్పించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25న తనతోపాటు తమ పార్టీ ప్రతినిధి బృందంతో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించామని గుర్తు చేశారు. శ్రావణిది ఇల్లు, భూమి లేని నిరుపేద కుటుంబమని తెలిపారు.

ఈ ఘటనపై విచారణ జరిపించి, శ్రావణి మామ శివార్ల సత్తయ్య, భర్త శివార్ల శేఖర్, కుటుంబ సభ్యులైన శివార్ల కుమార్, శివార్ల కవితలపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం ప్రకారం తల్లీబిడ్డలను హత్య చేసిన కేసు నమోదు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఆర్నెల్లలో వారిని శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో, ఐదెకరాల భూమితోపాటు, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని సూచించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 140కిపైగా కుల దురహంకార హత్యలు జరిగాయని తెలిపారు. ఇవి ఇంకా కొనసాగే ప్రమాదకర పరిస్థితులున్నాయని పేర్కొన్నారు. కావున ఇలాంటి దారుణాలను అరికట్టేందుకు ప్రభుత్వమే అవగాహన సదస్సులు నిర్వహించాలనీ, కుల, మతాంతర వివాహితుల రక్షణ చట్టం తేవాలని కోరారు.

ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

- తెలంగాణ ఆర్‌టిసి మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్
- ఆర్‌టిసి ఎమ్‌డి నాగిరెడ్డికి వినతిపత్రం అందజేత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్‌టిసిలోని మైనార్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆర్‌టిసి మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో తెలంగాణ ఆర్‌టిసి వీసీ, ఎండి వై నాగిరెడ్డికి ఆ అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అర్షద్ సాహిఖ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్‌ఖాన్, సలహాదారులు ఎండి రహీముద్దీన్ సాహెబ్, ఎండి హిదాయత్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి అరిఫ్, మొహిసిన్, తదితరులు పాల్గొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్సెస్ సదుపాయాన్ని కల్పించినట్టుగానే మైనార్టీ ఉద్యోగులకు కూడా కల్పించాలని ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డిని కోరారు. రంజాన్ నెలలో ఫాస్టింగ్ నేపథ్యంలో ఆర్‌టిసిలోని మైనార్టీ డ్రైవర్లు, కండక్టర్లకు ఉదయం పూట డ్యూటీ వేయాలని విన్నవించారు. సంవత్సరానికి ఒకసారి ఇచ్చే బోనస్‌ను రూ.10 వేలకు పెంచాలనీ, దసరా, క్రిస్మస్, రంజాన్ పండుగలను ఆప్షన్‌గా ఎంచుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఆర్‌టిసి సంస్థ తరపున ఇచ్చే ఇఫ్తార్ విందులను తిరిగి ప్రారంభించాలని విన్నవించారు. 2021 పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్‌టిసి సంస్థకిచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. తన పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎండి హామీనిచ్చారు.

ఎసిబికి చిక్కిన విద్యుత్ డిఇ షేక్ చాంద్ షరీఫ్ బాషా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పౌల్ట్రీ ఫామ్‌కు ట్రాన్స్‌ఫార్మర్ కోసం లంచం డిమాండ్ చేసిన పాపన్నపేట ట్రాన్స్‌కో డిఇ షేక్ చాంద్ షరీఫ్‌ను ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం సీతానగర్ గ్రామానికి చెందిన పాపన్నగారి భాస్కర్ పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ పౌల్ట్రీ ఫారంకు 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉందని పాపన్నపేట ట్రాన్స్‌కో ఎఇని సంప్రదించాడు. రూ.1.10 లక్షలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకోసం అధికారులు కొంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా పౌల్ట్రీ ఫామ్ యజమాని భాస్కర్ వాళ్లు అడిగిన డబ్బులు ఇవ్వలేదని రూ.2.09 లక్షలకు పెంచి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దాన్ని తగ్గించడానికి విద్యుత్ డిఇకి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. అందులో నుంచి రూ.తొమ్మిది వేలు ఓ వ్యక్తికి ఫోన్ పే చేశారు. మిగతా రూ.21 వేలును గురువారం ట్రాన్స్‌కో డిఇ కార్యాలయంలో ఇస్తుండగా.. ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తన సిబ్బందితో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం మెదక్‌లో డిఇ ఉంటున్న అద్దె ఇంటితో పాటు మెహిదీపట్నంలోని ఆయన స్వంత ఇంట్లో అధికారులు సోదాలు చేస్తున్నారు.

విశ్వాసాల ముసుగులో దాడులు

- ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నేడు ఆత్మగౌరవ ప్రదర్శన
- మంద కృష్ణమాదిగ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడితే..దళితులు చూస్తూ ఊరుకోబోరని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. సిజెఐపై దాడి జరిగి 25రోజులు గడుస్తున్నా..ఇప్పటి వరకు నిందితున్ని అరెస్టు చేయకపోవటమేంటని ప్రశ్నించారు. సిజెఐ గవాయ్ దళితుడు కాబట్టే ఈ నిర్లక్ష్యం కొనసాగుతున్నదని చెప్పారు. దీనికి నిరసనగా శనివారం హైదరాబాద్‌లో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దళితుల మీద జరిగిన దాడి మాత్రమే కాదనీ, రాజ్యాంగ వ్యవస్థమీద జరిగిన దాడిగా చూడాలన్నారు. అసమానతలను తొలగించేందుకు రాజ్యాంగం కృషి చేస్తున్నదనీ, ఇది సహించలేని వారు మాత్రమే ఇట్లాంటి దాడులకు పాల్పడతారన్నారు. జార్ఖండ్‌లో జడ్జితో వాగ్వాదానికి దిగినందుకే..న్యాయవాదిపై సుమోటోగా కేసు నమోదు చేశారని, సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే సుమోటోగా ఎందుకు కేసు ఫైల్ చేయటం లేదని ప్రశ్నించారు. వ్యవస్థలు మౌనంగా ఉంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్‌మాదిగతో పాటు ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.



హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య

- జెఎన్‌టియుహెచ్ సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మండలంలోని సుల్తాన్‌పూర్ జెఎన్‌టియుహెచ్ క్యాంపస్ హాస్టల్‌లో ఓ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. కళాశాల విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూర్యాపేట జిల్లా సిరికొండ మండలం పెద్దరాజు తండాకు చెందిన విద్యార్థి భానోత్ మహేందర్ (20) జెఎన్‌టియు సుల్తాన్‌పూర్‌లో సిఎస్‌ఇ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం మహేందర్ మధ్యాహ్న భోజనం ముగించుకొని హాస్టల్‌లోని తన రూమ్‌కు వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత రూంకు తిరిగి వచ్చిన తోటి విద్యార్థులు.. మహేందర్ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నంటూ గమనించి కేర్ టేకర్‌కు సమాచారం అందించారు. కేర్‌టేకర్ రూమ్‌లోకి వెళ్లి చూసి, వెంటనే ప్రిన్సిపల్‌కు సమాచారం అందించాడు. ప్రిన్సిపల్ విశ్వనాథం మహేందర్‌ను కిందికి దింపి యూనివర్సిటీ అంబులెన్స్‌లో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు.. విద్యార్థి మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం తల్లిదండ్రులకు, పోలీసులకు ప్రిన్సిపాల్ సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, జోగిపేట సీఐ అనిల్ కుమార్, పుల్కల్ ఎస్ఐ విశ్వజన్, క్లూస్ టీం వచ్చి రూంను పరిశీలించి ఆధారాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆందోల్ ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ కిష్టయ్య, ఆర్ఐ ప్రమోద్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రిన్సిపల్ విశ్వనాథంతో జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

రైతుల గోస పట్టదా..



ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి

- నష్టాలతో కన్నీళ్లు పెడుతుంటే రాజకీయం ముఖ్యమా..?
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాలతో రైతులు నట్టేట మునిగి ఆందోళన చెందుతుంటే.. వారి గోసను పాలకులు పట్టించుకోవడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు శుక్రవారం ధర్నా చేశారు. ధాన్యం, వరి పైరు కంకులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తుఫాను కారణంగా లక్షలాది ఎకరాల పంట నష్టం వాటిల్లిందన్నారు. నల్లగొండ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు పైగా పంటలు నీటిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటంతా వర్షాలతో నాశనమవ్వడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన పాలకులు పట్టించుకోకుండా జూబ్లీహిల్స్ ఎన్నికలపైనే దృష్టి పెట్టడం సరి కాదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని, రైతులు పంటలు నష్టపోయి ఇబ్బందులు పడుతున్నా కనీసం ఓదార్చే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. రైతుల గోస పాలకులకు పట్టదా అని ప్రశ్నించారు. ప్రతి సీజన్‌లో అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే బీమా పథకం కింద రైతులకు ఆదుకోవాలని, కానీ ప్రభుత్వాలు పంటల బీమా పథకాన్ని అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఫలితంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన వివరాలను సేకరించి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డీఏఓ శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి రాగిరెడ్డి మంగారెడ్డి, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు, సిపిఎం వన్‌టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డా.మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలేబోయిన వరలక్ష్మి, నాయకులు వినోద్‌నాయక్, పాల్వాయి రాంరెడ్డి, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు నెలల గడువు కావాలి

ఎమ్మెల్యేల అనర్హత కేసులో 'సుప్రీం'ను కోరిన స్పీకర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పటిషన్‌పై విచారణకు మరింత గడువు కావాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తన న్యాయవాదుల ద్వారా కోరారు. గతంలో సుప్రీంకోర్టు విధించిన మూడు నెలల సమయం శుక్రవారంతో ముగిసింది. దీంతో మరో రెండు నెలల గడువు ఇవ్వాలని స్పీకర్ కార్యాలయం కోరింది. నలుగురు శాసనసభ్యుల విచారణ మాత్రమే పూర్తయిందనీ, అంతర్జాతీయ సదస్సులకు వెళ్లాల్సి రావడంతో గడువు సరిపోలేదని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ల మేరకు మూడు నెలల్లో విచారించాలని సుప్రీం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై న్యాయ నిపుణులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి డి శ్రీధర్‌బాబు చర్చించారు. ఈమేరకు ఇప్పటివరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఇప్పటివరకు స్పీకర్ విచారించారు. తొలుత సుప్రీం ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చారు. అనంతరం అఫిడవిట్లు తీసుకున్న తర్వాత క్రాస్ ఎగ్జామిషన్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు 'తాము నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని' కలిశామని తమ లాయర్ల ద్వారా స్పీకర్ కోర్టులో వాదనలు వినిపించారు. అసెంబ్లీ రికార్డుల ప్రకారం ఇప్పటికీ తాము బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని చెప్పారు. ఇకపోతే మరో ఆరుగురి ఎమ్మెల్యేలకు సైతం ఇప్పటికే స్పీకర్ నోటీసులు జారీచేశారు. అందులో నలుగురు అఫిడవిట్లు సమర్పించగా, ఇద్దరు ఇవ్వలేదు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బాన్స్‌వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తోపాటు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు తదితరులను స్పీకర్ విచారించాల్సి ఉంది. రాజ్యాంగంలోని పదో ఆర్టికల్ ప్రకారం స్పీకర్ విచారణ చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనూ టీడీపీ నుంచి 11 మంది, కాంగ్రెస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం విదితమే.

పోలీసు కస్టడీలోనే రియాజ్ చనిపోయాడు

- ఎన్‌కౌంటర్‌పై సిబిఐ విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రియాజ్ క్రిమినల్ కాదని, పోలీసు కస్టడీలోనే చనిపోయారని సిటిజన్స్ ఫోరం నిజనిర్ధారణ ప్రతినిధులు తెలిపారు. నిజామాబాద్‌లో జరిగిన రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సిబిఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఫోరం ప్రతినిధులు ఖలీదా పర్వీన్, సారా మాథ్యూస్, మాజీద్ సుతారి, న్యాయవాది సమీర్ అలీ, మహ్మద్ అబ్దుల్ తాజ్, షేర్ సికిందర్ మాట్లాడారు. రియాజ్ బైక్ రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నారని తెలిపారు. కానిస్టేబుల్ ప్రమోద్ హత్య తర్వాత పోలీసులు రియాజ్ కుటుంబాన్ని కస్టడీలోకి తీసుకుని చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. నిజామాబాద్ వెళ్లి వాస్తవాలను పరిశీలించామని, అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. పోలీస్ స్టేషన్, ఆస్పత్రి పరిసరాల్లోని సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. అక్టోబర్ 17న కానిస్టేబుల్ ప్రమోద్ హత్య జరిగిందని, అదే నెలలో 20న రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేశారని చెప్పారు. ప్రస్తుతం రియాజ్ ఎన్‌కౌంటర్ కేసును ప్రభుత్వం సిట్‌కు అప్పగించిందన్నారు. దీనిని సీబీఐకి అప్పగిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను ఎవరు చంపారో వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రియాజ్ చాకుతో పొడిచి ప్రమోద్‌ను చంపారని పోలీసులు పేర్కొంటున్నారని, దీనిపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రియాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత అతని కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వారికి రూ.ఐదు కోట్ల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మహోన్నతమైన వ్యక్తి సామినేని రామారావు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం
- సిపిఎం ఏపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సంతాప సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహోన్నతమైన వ్యక్తి సామినేని రామారావును కాంగ్రెస్ గూండాలు అతి దారుణంగా హత్య చేశారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో సిపిఎం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు మృతదేహానికి తమ్మినేని వీరభద్రం, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. అనంతరం ఎపి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం. సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జూలకంటి రంగారెడ్డి, టి. సాగర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు... రామారావు భౌతికకాయంపై పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. గ్రామంలో సిపిఎం బలహీనంగా ఉన్న సమయంలో రామారావు బలమైన పార్టీగా తీర్చిదిద్దారన్నారు. రామారావు మృతి రాష్ట్రానికే తీవ్ర నష్టమని అన్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని స్పష్టం చేశారు.

హత్యా రాజకీయాలు చేసేవారు అరణ్యవాసం చేయక తప్పదు : వి.శ్రీనివాసరావు

హత్య రాజకీయాలు చేసేవారు భవిష్యత్తులో అరణ్యవాసం చేయక తప్పదని వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సామినేని రామారావుని కాంగ్రెస్ గూండాలు అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. హత్యా రాజకీయాలు చేసేవారికి ప్రజలు కచ్చితంగా సమాధి కడతారన్నారు. డిప్యూటీ సిఎం, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క.. రామారావు హత్యను ఖండిస్తూ ప్రకటన చేయటం కాదు, హంతకులను పట్టించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాతర్లపాడులో ఘోరంగా ఓడిపోతామని నిర్ధారణ కావడంతోనే హత్య చేశారన్నారు.

మీకు చేతకాకపోతే చెప్పండి మేము పట్టుకుంటాం : జాన్‌వెస్లీ

రామారావును హత్యచేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి లొంగి కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే ఆ హంతకులను తాము పట్టుకుంటామని జాన్‌వెస్లీ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా హత్యా రాజకీయాలు మానుకోవాలని అన్నారు. తమ పార్టీకి ప్రాణాలు ఇవ్వడం కొత్తేమీ కాదని, ఇది చేతకానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. 24 గంటల్లో హంతకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పేద, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే పని చేశారు : పోతినేని సుదర్శన్ రావు

పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసిన మహానాయకుడు సామినేని రామారావు అని పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. దశాబ్దాల క్రితమే రామారావును హత్య చేయాలని ప్రయత్నం చేశారని, కానీ ఆ ప్రయత్నాలు విఫలం అయ్యాయని తెలిపారు. గుండాలు, రౌడీలతో నియోజకవర్గంలో పరిపాలన చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి నర్సింహారావు, పార్టీ ఏపి రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, దడాల సుబ్బారావు, తెలంగాణ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి. ప్రసాద్, బాబురావు, బండి రమేష్, విక్రం, బుగ్గవీటి సరళ, అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, జనగామ జిల్లాల కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జున రెడ్డి, కనకారెడ్డి, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, షేక్ జబ్బార్, పొన్నం వెంకటేశ్వరరావు, బండి పద్మ, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొని నివాళి అర్పించారు. సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు సంతాపం తెలిపారు.

టీచర్ దాష్టీకం..

- రాడ్‌తో విద్యార్థులను కొట్టిన వైనం
- పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థులు
- వికారాబాద్ జిల్లా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్నపిల్లలని చూడకుండా విద్యార్థులను రాడ్డుతో టీచర్ చితకబాదాడు. దాంతో తట్టుకోలేక భయానికి గురైన ఇద్దరు విద్యా ర్థులు పాఠశాల నుంచి పారిపోయారు. వికారాబాద్ శివారెడ్డిపేట్ సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరవ తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు బుధవారం రాత్రి డార్మెటరీలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో పిఇ టీచర్ అన్వర్ ఖాన్ వారిని రాడుతో కొట్టాడు. ఈ ఘటనలో జీవన్ అనే విద్యార్థితో పాటు మరో విద్యార్థి భయంతో గురువారం పాఠశాల నుంచి పారిపోయారు. విద్యార్థులు స్థానిక ఎన్‌టిఆర్ చౌరస్తా వద్ద తిరుగుతుండగా పాఠశాల నర్స్ జమున గుర్తించి వారిని తిరిగి పాఠశాలకు తీసుకువచారు. తరువాత విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, కొట్టిన విషయాన్ని పక్కనబెట్టి 'మళ్లీ పారిపోతే పాఠశాల బాధ్యత కాదు' అని లేఖ రాయించుకున్నారు. అయితే తల్లిదండ్రులు.. పిల్లలను కొట్టిన విషయంపై ప్రశ్నించగా.. వైస్ ప్రిన్సిపల్ రాజేందర్, నర్స్ జమున ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. సెక్యూరిటీ గార్డ్ జహంగీర్ సైతం తల్లిదండ్రులతో అశ్రద్ధగా మాట్లాడాడు. అయితే విద్యార్థులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల సిబ్బందిని నిలదీశారు. వారు సరైన సమాధానం ఇవ్వలేదు.

పిఇటి అన్వర్ ఖాన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్

విద్యార్థులను రాడ్డుతో కొట్టిన పీఈటీ అన్వర్‌ఖాన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. మైనార్టీ బాలుర పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సందర్శించి, విద్యార్థులపై జరిగిన దాడి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా అక్బర్ మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠాలు ఏ విధంగా చెప్పాలి, ఎలా చెప్పాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినా మైనారిటీ గురుకులంలో ఉపాధ్యాయుల తీరు మాత్రం మారడం లేదన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, దాంతో చాలా రోజుల నుంచి విద్యార్థులు సరైన భోజనం లేక పస్తులు ఉన్నారని తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం వల్ల విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదన్నారు. అలసత్వం ప్రదర్శించిన వార్డెన్ ఖదీర్, సెక్యూరిటీ గార్డ్ జహంగీర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

అజారుద్దీన్ కేసులపై కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి

- టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త మంత్రి అజహరుద్దీన్‌పై ఎలాంటి కేసులున్నాయో, అవి ఏమయ్యాయో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇండియా క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఆయన ఎన్నో విజయాలను దేశానికి అందించారనీ, ఆ విషయాన్ని మంత్రి కిషన్‌రెడ్డి మరిచిపోయారా? అని ప్రశ్నించారు.

ఎంపిగా కూడా అజహరుద్దీన్ ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడాన్ని బిజెపి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. అజహరుద్దీన్ సుదీర్ఘ కాలం దేశానికి సేవలను అందించారని కొనియాడారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల మైనార్టీలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి పదవి గురించి మూడు నెలల ముందుగానే నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

రామ్మోహన్‌రావు మృతికి ఐలు, సిఐటియు సంతాపం



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి.విద్యాసాగర్ సోదరుడైన రామ్మోహన్‌రావు అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల వారి నివాసంలో రామ్మోహన్‌రావు భౌతికకాయానికి నవ తెలంగాణ దినపత్రిక చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామ్మోహన్‌రావుకు నివాళులు అర్పించిన వారిలో నవతెలంగాణ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ శశిధర్ ఉన్నారు.

ఐలూ, సిఐటియు సంతాపం

ఆలిండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులుగా ఉన్న సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ సోదరుడు రామ్మోహన్ రావు మృతి పట్ల ఆలిండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐలూ రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె పార్థసారథి సంతాపం ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శి కె పార్థసారథి, రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి, ప్రవీణ్, మాధవరెడ్డి, వెంకటేష్ తదితరులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రామ్మోహన్‌రావు మృతికి సిఐటియు రాష్ట్ర కమిటీ తరపున ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ సంతాపం ప్రకటించారు. రామ్మోహన్ రావు భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వారితో పాటు సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, ఎం వెంకటేష్, కూరపాటి రమేష్, ఉపాధ్యక్షులు వివిఎస్ రావు, కె ఈశ్వర్‌రావు, ఎం శ్రీనివాస్ తదితరులున్నారు.



సమాచార శాఖ డిడి పదవీ విరమణ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న జి ప్రసాదరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఆయా హోదాల్లో దాదాపు 41 సంవత్సరాల సర్వీసులో ఉన్నారు. ప్రసాదరావు పదవి విరమణ కార్యక్రమాన్ని సమాచారభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో పలు హోదాల్లో పని చేసిన ప్రసాదరావు సేవలను ఈ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన సీనియర్ అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డి ఎస్ జగన్, డి శ్రీనివాస్, కె వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు హాష్మి,, వై వెంకటేశ్వర్లు సురేష్, ఆర్ఐఇ జయరాం మూర్తి, తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ శాస్త్రితోపాటు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, డిడి ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ ఆస్పత్రి ఘటనపై విచారణకు కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రిలో ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిన్న గూడురు మండలం బయ్యారం గ్రామానికి చెందిన డ్రైవర్ రాజు అనే వ్యక్తి కిడ్నీ సమస్యతో ఆస్పత్రికి రాగా ఆధార్ కార్డ్ లేదని ట్రీట్మెంట్ చేసేందుకు వైద్యులు నిరాకరించారని, అక్కడే కళ్లు తిరిగిపడిపోయిన అతన్ని చనిపోయాడని భావించిన సిబ్బంది అనాథ శవం అనుకుని మార్చురీలో పెట్టినట్టు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఉదయం స్వీపర్ మార్చురీ శుభ్రం చేస్తున్న సమయంలో వ్యక్తి బతికే ఉన్నాడని గుర్తించి సమాచారం ఇవ్వడంతో అతన్ని అక్కడ్నుంచి షిఫ్ట్ చేసి వార్డుకు తరలించినట్టు వైద్యులు, సిబ్బందిపై విమర్శలు వచ్చాయి. అయితే మానవీయ కోణంలో తమ సిబ్బంది చికిత్సనందించేందుకు రోగిని తెచ్చి కూర్చొబెడితే కొంత మంది ఉద్దేశపూర్వకంగా దాన్ని వక్రీకరించారని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇది వరకే దానిపై వివరణ ఇచ్చారు. దీనిపై మరింత స్పష్టత కోసం ప్రభుత్వం ములుగు గవర్నమెంట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్, జనగాం గవర్నమెంట్ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ గోపాల్‌రావు, సిద్ధిపేట గవర్నర్ మెంట్ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి శ్రీధరాచారితో కమిటీ వేశారు.

పెళ్లి వాహనాన్ని ఢీకొట్టిన బోర్వెల్ డిసిఎం

- ముగ్గురు మృతి.. తొమ్మిది మందికి గాయాలు
- హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మరు పెండ్లికి వెళ్లి తిరిగి వస్తున్న బొలెరో వాహనాన్ని బోర్వెల్ డిసిఎం ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతిచెందిన దగా 9మందికి గాయాలైన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ హైవే రోడ్డుపై శుక్రవారం జరిగింది. ముల్కనూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదన్‌పల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మికి సిద్దిపేట జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన భాస్కర్‌తో అక్టోబర్ 29న సూదన్‌పల్లిలో పెండ్లి జరిగింది. అనంతరం పెళ్లి కుమారుడు భాస్కర్ గ్రామం వెంకటాపురంకు వెళ్లారు. మరునాడు పెళ్లి కుమారుని ఇంటికి పెళ్లి కుమార్తె బంధువులు వెళ్లారు. అదే రోజు తిరుగు ప్రయాణమయ్యారు. కాగా, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారు హైవే రోడ్డు పక్కన కొంతసేపు తమ బొలెరో వాహనాన్ని ఆపుకున్నారు. కాగా, అదే రోడ్డుపై వెనుక నుంచి వస్తున్న బోర్‌వెల్ డిసిఎం వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రెడ్డబోయిన స్వప్న (16), రెడ్డబోయిన శ్రీనాథ్ (6), రెడ్డబోయిన కళమ్మ (55) అక్కడికక్కడే మృతిచెందారు. అనసూయ, మారుతి, రమాదేవి, దేవేందర్, నవలోక్ రిత్విక్, సరోజన, కార్తీక్‌కు తీవ్ర గాయాలు కాగా ఎంజిఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవ్యక్తి శ్రీరామ్ రాజు వరంగల్ గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బోర్వెల్ డిసిఎంను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ గడ్డం నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

మహిళ ఆత్మహత్య!

- ఎస్ఐ వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- వెంపటి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవమానభారంతో మహిళ ఆత్మహత్య చేసుకోగా.. అందుకు ఎస్ఐ వేధింపులే కారణమని బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామంలో శుక్రవారం ఉదయం వెలుగుజూసింది. మృతురాలి కుమార్తెలు సరిత, అనిత, కుమారుడు మహేష్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. 15 రోజుల కిందట వెంపటి గ్రామానికి చెందిన సోమనర్సమ్మ (50) బావ మల్లయ్య ఇంట్లో బంగారం పోయిందని, ఆమెపై నెపం నెట్టి తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన కొంతమంది పెద్దమనుషులు, మల్లయ్య కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్లారు. పోలీసులు సోమనర్సమ్మను విచారణ నిమిత్తం తీసుకెళ్లి గురువారం రాత్రి ఎనిమిది గంటల వరకు తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. ఎస్ఐ క్రాంతికుమార్ ఆమెను వేధింపులకు గురిచేశారు. "నిన్ను జైలుకు పంపుతాం.. నీవే దొంగతనం చేసినట్టు ఒప్పుకో.. ఫింగర్ ప్రింట్స్ ఉన్నాయి' అంటూ బెదిరించారు. ఆ తర్వాత ఇంటికొచ్చిన సోమనర్సమ్మ అవమానం భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఎస్ఐని వివరణ అడగడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. సోమనర్సమ్మ ఆత్మహత్యతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ క్రాంతి కుమార్‌పై పోలీస్ ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.